కథ

# ఇదా జీవితం

◆ ఇందిరా నాగేంద్ర ◆

రైలు శరవేగంతో హైదరాబాద్ వైపు దూసుకు వస్తోంది.

కిటికీ ప్రక్కన కూర్చున్నాడు నిఖిల్. అతని చూపుల్లో శూన్యత. ఈ లోకంలో లేనట్టుగా భావ రహితంగా వున్నాయి.

"ఏమండీ ఏ వూరు వెళ్తున్నారు" అని అడిగాడు నిఖిల్ ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడు.

"..." నిఖిల్ నుండి ఎలాంటి సమాధానం లేదు. విన్పించిందో లేదోనని అనుమానం వచ్చి ఆ ప్రయాణీకుడు మళ్ళీ పలుకరించాడు.

"ఏమండీ ఏ వూరు వెళ్తున్నారు" అని ఈసారి గట్టిగా అడిగాడు.

"..." మళ్ళీ నిఖిల్ నుండి ఎలాంటి సమాధానం లేదు. ఆ ప్రయాణీకుడు విసుక్కుని ఇంకో ప్రక్కకు తిరిగి మరో ప్రయాణీకుడితో ముచ్చట్లలో మునిగిపోయాడు.

నిఖిల్ ఆలోచనా ప్రవాహంలో కొట్టుకు పోతున్నాడు. తెల్లవారు జామున అందిన టెలిగ్రాం నాన్నమ్మ మరణాన్ని తెలియ జేసింది. అప్పటి నుండి నిఖిల్ మనస్సు మనస్సులో లేదు. వాస్తవం మరుగున పడి గతం కళ్ళ ముందు మెదులుతోంది.

తాతయ్య నాన్నమ్మలకు ఇద్దరు మగ సంతానం, ఒక ఆడపిల్ల. అందరిలో నాన్నగారే పెద్ద. అందరి పెళ్ళిళ్ళు తాతయ్య ఘనంగా చేసాడు. ఇద్దరి కోడళ్ళకు చెరి నలభై కాసుల బంగారం పెట్టాడు. కూతురు పెళ్ళి కూడా భారీగ కట్నకానుకలిచ్చి జరిపించాడు.

అన్ని బాధ్యతలు తీరాక హఠాత్తుగా గుండె పోటుతో తాతయ్య మరణించాడు. తాతయ్య చనిపోయాడని తెలియగానే శవాన్ని ముందు గదిలో పడుకోబెట్టారు.

నాన్నగారు, బాబాయ్... తాతయ్య దహన సంస్కారానికి చెయ్యవలసిన ఏర్పాట్లకన్నా ముందు అర్జంటుగా తాతయ్య "ఇనప్పెట్టె తాళం చెవి" గురించి తాతయ్య నడుం వగ్గర తడిమి చూసారు. తాళం చెవి కన్పించలేదు. తాళం చెవి ఎవరికి దొరికితే వారు తాతయ్య దాచిన నగదును, బంగారాన్ని తస్కరించాలని వారి ప్రయత్నం. తాతయ్య దిండు క్రింద దొరికింది తాళం చెవి. వెంటనే నాన్నగారు దాన్ని తీసి జేబులో వేసుకున్నారు. బాబాయ్ తాళం చెవి తనకిమ్మని నాన్నగారితో పోట్లాడుతున్నాడు. అమ్మ, పిన్ని కూడా ఆ గొడవలో పాలు పంచుకున్నారు.

ఎంగిలి విస్తరాకుల గురించి పోట్లాడే కాట్లకుక్కల్లాగ తాళం చెవి గురించి వారు పోట్లాడుకుంటున్నారు.

జన్మనిచ్చిన తండ్రి శవాన్ని ముందు గదిలో వుంచుకుని నాన్నగారు, పిండేస్తున్నంత బాధ కలిగింది.

తాతయ్యా... నువ్వు ఎండనక, వాననక కష్టానికి నువ్వు 'ప్రతిపైసా' కూడబెట్టి పెంచిన ఐశ్వర్యం, నువ్వు నీ పిల్లల భవిష్యతత్తు కోసం దాచిన డబ్బు చివరికి నీ విలువనే పోగొట్టిందా...?

దహన సంస్కారాల కార్యక్రామాలు తాత్కాలికంగా మరుగున పడి తాళం చెవి విషయమైన చర్చ ప్రధానంగా నిలబడింది.

తండ్రిపోయాడనే బాధలేకపోయినా కనీసం చూడవచ్చిన బంధువులు ఏమనుకుంటారో అనే ఇంగిత జ్ఞానం కూడా 'దనదాహం' ముందు కోల్పోయారు.

చిట్ట చివరకు బంధువులు కల్పించుకుని 'తాళం చెవికి' నలుగురు పెద్ద మనుష్యుల మధ్య 'సెక్యూరిటీ' కల్పించారు.

తాత్కాలికంగా తాళం చెవి సమస్య సద్దు మణిగింది. తాళం చెవికి సెక్యూరిటీ ఏర్పడంగానే తేలిక పడిన గుండెలతో శవం దగ్గర చేరి గుండెలవిసేలా ఏడుస్తున్నారు 'ఫార్మాలిటీ' కోసం.

అప్పటి వరకు తాళం చెవి కోసం గొడవ పడ్డ విషయం మర్చిపోయినట్టుగా, కాదు ... కాదు... అసలేం జరగనట్టుగా చాలా 'క్యాజువల్‌గా' గుండెలవిసేలా ఏడుస్తున్నారు.

మానవుడు ప్రాణం అశాశ్వతమన్న నగ్న సత్యాన్ని తెలిసి కూడా ఎందుకింత తాపత్రయ పడతారో. ఎందుకింత లేకి ఆశలను పెంచు కుంటారో అర్థం కాదు.

మనిషే శాశ్వతం కానప్పుడు మనిషి సంపాదించే డబ్బు శాశ్వతమా...? మనిషి జీవిత కాలమెంత మహా ఎక్కువైతే డెబ్భై సంవత్సరాలు బ్రతుకుతారేమో. అందులో పదిహేను బాల్యంతోనే గడిచిపోతుంది. ఇరవై సంవత్సరాలు యవ్వనం... తరువాత వార్ధకం... అటు

●●●

కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించినకథ.

●●●

తరువాత... మరణమే కదా...

ఇంత చిన్న జీవితానికి ఎన్నెన్నో కష్టాలు, ఎన్నో కన్నీళ్ళు, మరెన్నో అద్భుతాలు... ఆనందాలు... ఆశ్చర్యాలు. అయినా 'ఏవి శాశ్వతం' కావు. కావని తెలిసీ తాము కోరుకున్నది పొందాలనే ఆరాటాలు, పోరాటాలు.

ఒకవేళ... ఒకవేళ... మనిషే శాశ్వతం అయితే... బహుశా పరిస్థితులు ఇంకా భయంకరంగా, నిర్లజ్జగా వుంటాయేమో? శాశ్వతం కాని జీవితానికే ఇన్ని కక్షలు, కుట్రలు, దోపిడీలు, హత్యలు, నీచ రాజకీయాలు...

తాతయ్యా... నీవు సంపాదించిన డబ్బు కోసం మమతానురాగాలు మరచి కాట్ల కుక్కల్లా పోట్లాడుకుంటున్న వారిది తప్పా... లేక... లేక... అవసరానికి మించి నువ్వు డబ్బు సంపాదించడం నీ తప్పా....?

నీవు అవసరాన్ని మించి సంపాదించిన డబ్బే ఇద్దరు అన్నదమ్ముల మధ్య బేధాభిప్రాయాన్ని సృష్టించింది. నీ కొడుకులకు నీపైన వుండే ప్రేమ, అవసరానికి మించి నువ్వు సంపాదించిన డబ్బు పైకి మళ్లింది.

అంటే... నీకన్నా నీవు సంపాదించిన డబ్బుకు విలువ పెరిగింది. అంటే... అంటే... నీ విలువను నీవే పోగొట్టుకున్నావ్ తాతయ్యా... నీవు అవసరానికి మించి సంపాదించిక పోయినట్లైతే నీ కొడుకులు ముందుగా దహన సంస్కారానికి ఏర్పాట్లు చేసేవారేమో...?



## ప్రేమ పూజారి

భజన్ సామ్రాట్ 'అనూప్ జలోటా' ప్రేమ పూజారిగా మారినట్లు కనిపిస్తోంది. బర్లారాయ్‌తో ఇప్పటికే రెండు చిత్రాలు నిర్మిస్తున్న అతనిలో ఆమెపై ఉన్న ప్రేమాగ్ని చాల్లారనట్టుగా వుంది. ఇప్పుడు ఆమె దర్శకత్వంలో మూడవ చిత్రాన్ని ప్రారంభించబోతున్నాడు. అందులో వినోద్‌ఖన్నా కొడుకు 'రాహుల్' హీరోగా, రీనారాయ్ మరో చెల్లెలు 'అంజూరాయ్' హీరోయిన్‌గా నటిస్తున్నారు.



నిఖిల్ కళ్ళ నుండి నిశ్శబ్ధంగా రెండు కన్నీటి బొట్లు జారి తాతయ్య పాదాలపై బడ్డాయి.

తాతయ్య పోయాక నాన్నమ్మ పరిస్థితి పూర్తిగా తలక్రిందులైంది. తాతయ్య పోగానే నాన్నమ్మ ఎక్కడ వుండాలనేది ప్రధాన సమస్య. మా ఇల్లు, బాబాయ్ వాళ్ళ ఇల్లు ప్రక్క ప్రక్కనే. మధ్యలో గోడ మాత్రమే అడ్డు. తాతయ్య పోయిన పదవ ఖర్మనాడే ఇద్దరన్న దమ్ములు ఆస్తులు పంచేసుకుని అడ్డుగోడ పెట్టేసుకున్నారు.

తాతయ్య ఆస్థిని అన్నదమ్ములు ఆనందంగా పంచేసుకున్నారు. కాని నాన్నమ్మ బాధ్యత ఎవరు తీసుకోవాలనే సరికి ఇద్దరిలో బాధ పెరిగిపోయింది.

చివరకు ఒక్క నెల నాన్న దగ్గర, ఒక్క నెల బాబాయ్ దగ్గర వుండేట్టుగా నిర్ణయం అయ్యింది ఆ ఒంటరి ప్రాణికి.

ఇంక అక్కడ నుండి మొదలయ్యాయి కోడళ్ళ సూటి, పోటి మాటలు, విసుగులు. వాటి మధ్య నాన్నమ్మ నలిగిపోయింది. నాన్నమ్మ అవసరాలు ఆ ఇంట్లో ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఆమె ఆ ఇంట్లో ఒక 'వేస్టేజ్' అన్నమాట. ఆమెకు పెట్టే తిండి వేస్ట్, ఆమె అవసరాలు అంతకన్నా వేస్ట్ వారి దృష్టిలో.

ఇంక చెప్పాలంటే ఆమె ఎప్పుడు పర లోకానికి టికట్టు తీసుకుంటుందాని ఇద్దరు కోడళ్ళు ఎదురు చూడటం పరిపాటయ్యింది.

నాన్నమ్మను ఎవరూ కష్టపడి పోషించక్కర లేదు. తమ తరువాత తరం కూడా కూర్చుని తినేంత ఆస్థిని సంపాదించి పెట్టి పోయాడు తాతయ్య.

నాన్నమ్మ ఆస్థి నాన్నమ్మకు పెట్టడానికే వారికి కష్టంగా వుంది. ఒకవేళ... ఒకవేళ... తాతయ్య కాని సంపాదించి పెట్టకుండా వుండి వుంటే... బహుశా తాతయ్య పోయాక నాన్నమ్మను బయటకు గెంటేసే వాళ్ళమో...?

ఒక విధంగా తాతయ్య సంపాదించిన ఆస్థి నాన్నమ్మకు ఆ ఇంట్లో వుండే స్థానాన్ని కల్పించిదేమో...? ఆస్థులు పంచుకున్నారు కాని తల్లి బరువైపోయింది అంటారేమోనని లోకం నిందకు భయపడి ఆస్థులతో పాటు తల్లిని ఒక్కొక్క నెల ఒక్కొక్కరి దగ్గర వుండేట్లుగా పంచేసుకున్నారు పుత్రరత్నాలిద్దరూ భార్యల సలహాలపై.

నాన్నమ్మ చిన్న కోడలు దగ్గర వున్నప్పుడు చిన్న కోడలు "ఉన్నదంతా పెద్ద కోడలుకు చాటుగా చేరవేసావు. మాకు అన్యాయం చేసావు" అంటూ సాధించడం.

అంటే తాతయ్య బ్రతికున్నప్పుడు, పెద్ద కొడలుకు ఏమైన ఆస్థిని చాటుగా ఇచ్చిందేమో నని అనుమానం.

పెద్ద కోడలు దగ్గర వున్నప్పుడు, ఉన్నదంతా చిన్న కోడలుకు చాటుగా ఆస్థిని చేరవేసిందేమోనని అనుమానం. ఆ అను మానంతో ఇద్దరు కోడళ్ళు సాధించడమే. కోడళ్ళతో పాటుగా వారి పిల్లలు కూడా నాన్నమ్మను సాధించడమే, మాకు అన్యాయం చేసావంటే మాకు అన్యాయం చేసావని.

అలా దినదిన గండంగా రోజులు నెట్టు కొస్తోంది ఆ ముసలి ప్రాణం. నిజానికి నాన్నమ్మకి ఎవరికి చాటుగా అందివ్వాల్సిన అవసరం లేదు. వారు పరాయి వారు కాదు. తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డలు.

నిజానికి వారికి ఈ విషయం తెలియదా...? ఊహు... నిజాన్ని గ్రహించే జ్ఞానం వారికెక్కడిది.

ఒకరిపై ఒకరికి అనుమానాలు, అక్కసులు. వారి అల్పబుద్ధి వారి వరకే వుంటే బాగుండేది. కాని వారి అల్పబుద్ధిని వారిపై రుద్దడమే కాకుండా పైగా సాధింపు కూడా.

నవమాసాలు మోసి కని పెంచి పెద్దజేసిన తల్లి వారికిప్పుడు భారమైంది. వారి అభివృద్ధికి తల్లి, తండ్రులు పడిన పాట్లు గుర్తుకు రావేం. వారిప్పుడున్న స్థితికి కారకులెవరో ఆలోచించరేం.

"అడ్డాలనాడు బిడ్డలు కాని గడ్డాల నాడు కాదు" అనే సూక్తి నిజమేనేమో.

నాన్నమ్మకు మధ్యాహ్నానం పన్నెండింటికి కాఫీ అనబడే 'కషాయం లాంటి నీళ్ళు' ఇచ్చేవారు. రెండు గంటలకు విసుగుల మధ్య, తిట్ల మధ్య భోజనం. తిరిగి రాత్రి పది గంటలకు వారు తినగా మిగిలిన అన్నం, ఇంత చారు పెట్టేవారు. పదింటి వరకు వాళ్ళు పెట్టే భోజనానికి మేలుకుని వుండేది. తన గుక్కెడు ప్రాణాలు నిలుపుకోడానికి. మరి కొడుకులైనా చూసి చూడనట్టుగా వురుకునే వారే కాని అమ్మను సరిగ్గా చూడమని చెప్పేవారు కాదు.

నిజానికి కొడుకులకు తమ ఇంట్లో తల్లితో పాటుగా వారికి కూడా పూర్తి స్వాతంత్ర్యం లేదు. భార్యలంటే భయం. ఎంత విచిత్రం... తమ ఇంట్లోకి పెళ్ళి పేరుతో భార్యగా వచ్చి ఆ ఇల్లును తన ఆధీనంలోకి తీసుకుని అధికారం చెలాయించటం ఎంత ఆశ్చర్యం కదు...

భార్యలు ఎలా చెప్తే అలా చెయ్యటమే వారి పని. వారికి సొంత వ్యక్తిత్వం లేదు. వారి 'రిమోట్ కంట్రోలర్' భార్యల చేతుల్లో వుంది. నిజానికి వారు కీ ఇస్తే కదిలే ప్రాణం వున్న బొమ్మలలాంటి వారు. భార్యలకు ఎదురు చెప్పి తల్లిని మంచిగా చూసుకోమని చెప్పే ధైర్యం లేని ఘురానా వ్యక్తులు.

కోడళ్ళ సాధింపుతో, భర్త పోయాడన్న బాధతో నాన్నమ్మ పూర్తిగా మంచం పట్టింది. ఆమె అనారోగ్యంతో ఆమె పరిస్థితి ఇంట్లో మరింత దిగజారింది. ఆరోగ్యంగా వున్నప్పుడే స్నానం చేయాలంటే 'సబ్బు ఖర్చు' అని వారానికి ఒక్కసారే స్నానానికి నీళ్ళిచ్చే వాళ్ళు. అలాంటిదిప్పుడు పూర్తిగ స్నానం నిషేధించారు.

తాతయ్య పోయినప్పటి నుండి తలకు నూనె ఎరుగదు నాన్నమ్మ. అదొక వృధా ఖర్చని కోడళ్ళ అభిప్రాయం. భార్యల అభిప్రాయమే వారి భర్తల అభిప్రాయం కనుక నూనే ఖర్చు కూడా తప్పించేసారు. తైల సంస్కారం లేని తల, తల స్నానం లేక పిడచకట్టుకుపోయింది.

నాన్నమ్మ అనారోగ్యంతో పూర్తిగా మంచంపై నుండి లేవలేని స్థితికి వచ్చింది. చిన్నకోడలు నాన్నమ్మ విషయం వదిలేసింది, నాన్నమ్మకు సేవ చేయాల్సి వస్తుందని. దాంతో అమ్మకు కోపం వచ్చింది నేనే చేయాలా అని. ఇద్దరి మధ్యా నాన్నమ్మను సామానుతో పాటు సామాను గదిలో వేసారు. పడుకోడానికి ఒక చింకిరి చాప, కప్పుకోడానికి చిరుగుల దుప్పటి, తినడానికి నత్తుగిన్నె, నగం విరిగిన కప్పు ఇదీ ఇప్పుడు ఆమె పరిస్థితి.

తాతయ్య వున్నప్పుడు ఎలా బ్రతికింది నాన్నమ్మ. వంటి నిండా నగలతో, ఇంటి నిండా ధాన్యంతో ఎంత సుఃఖాన్ని అనుభవించిందని. అలాంటి నాన్నమ్మ పరిస్థితి ఎలా మారింది.

చివరి దశలో నాన్నమ్మకు సేవ చేయలేదని పేరొస్తుందని అమ్మా, పిన్ని కలిసి నాన్నమ్మను ఎంతగా నిందించారు. ఇంటికి వచ్చిన బంధువుల ముందర "మంచిగా వున్నప్పుడు మమ్మల్ని సుఃఖ పడనివ్వలేదు. ఇప్పుడు జబ్బుతో మా ప్రాణాలు తోడేస్తోంది. ఈ చాకిరి చేయలేక చచ్చిపోతున్నాం" అంటూ దీర్ఘాలు తీయడం. ఇంటికి వచ్చిన బంధువులు తమను వేలెత్తి చూపకుండా ఆప్యాయంగా వారికి సుష్టిగా భోజనాలు పెట్టేవారు నోరు తెరవకుండా మర్యాదలు చేసి పంపేవారు.

సుష్టిగా భోంచేసిన బంధువులు పైనుండి నాన్నమ్మకు అక్షంతలు వేయడం "మంచిగా వున్నప్పుడు వీళ్ళు మనల్ని సుఃఖంగా వుండనివ్వరు. అంత్య దశలో మళ్ళీ చాకిరి అంతా కోడళ్ళే చేయాలి... ఎటూ కోడళ్ళకు తప్పవమ్మా కష్టాలు" అంటూ అమ్మా, పిన్నిని బంధువులు. ఈ విధంగా సంతృప్తి పరిచి వెళ్ళేవారు.

అయినా నాన్నమ్మ నోరు విప్పేది కాదు. అన్నింటికి మౌనం పాటించడం అలవాటు చేసుకుంది. ఓపిక వున్నంత కాలం ఆమె శరీరం నరకయాతన అనుభవించిన ఆమె ఆత్మ ఓపిక నశించి అలసిపోయి... నిశ్శబ్దంగా ఆమె శరీరం నుండి వెళ్ళిపోయింది.

★ ★ ★ ★ ★

రైలు ఒక్క కుదుపుతో ఆగింది. గతం గుర్చి ఆలోచనల ప్రవాహంలో కొట్టుకు పోతున్న నిఖిల్, రైలు కుదుపుతో తెప్పరిల్లి వాస్తవంలోకి వచ్చాడు. కిటికీ నుండి తల బైటకు పెట్టి చూసాడు ఏ స్టేషనో తెలుసుకోడానికి. పెద్ద పెద్ద అక్షరాలతో 'నాంపల్లి' అని వుంది. వెంటనే సూట్‌కేసు తీసుకుని రైలు దిగాడు నిఖిల్.

ఇంటికి అల్లంత దూరాన వుండగానే పెద్దగా ఏడ్పులు, శోకాలు విన్పించాయి నిఖిల్‌కు. ఒక్కసారిగా అతని గుండె గొంతులోకి వచ్చినట్టుగా అయ్యింది. ఎలాగో మనస్సును కూడ దీస ఎని ఇంట్లోకి వచ్చాడు.

అ. ఎ ఇంట్లో అడుగు పెట్టాడో లేదో "ఎపోయిందిరా నిఖిల్, అంతా అయ్యిపోయిందిరా... ఇక మీకు నాన్నమ్మ లేదురా" అని అమ్మా, పిన్ని పెద్దగా ఏడుస్తున్నారు. తారస్థాయికి అందుకున్న వాళ్ళ ఏడుపులు చేసేసరికి ఒక్కసారిగా దిగ్భ్రాంతి కలిగింది నిఖిల్‌కు.

ఏమిటిదంతా...? ఆమె బ్రతికుండగా నాన్నమ్మను ఒక్కసారి కూడా ఆప్యాయంగా వలు కరించిన వారు లేరు. ఆమెను పట్టించు కున్న వారు లేరు. బ్రతికుండానే ఆమె శరీరం చీమలకు, చెదలకు ఆలవాలమైంది. ఘోరమైన నరకాన్ని చూసింది చివరి దశలో చూసే వారు లేక.

కనీసం కొడుకులైన ఆమె బ్రతికుండగా ఒక్కసారైనా ఆమె వైపు చూసెరుగరు. నిఖిల్... తండ్రివైపు, బాబాయ్ వైపు చూసాడు. కాని... చిత్రంగా... ఇప్పుడు నాన్నగారు, బాబాయ్ వాళ్ళుకూడ ఎలా... వల వల ఏడుస్తున్నారు చిన్నపిల్లల్లాగ. ఇదంతా తల్లి చనిపోయిందన్న బాధా... లేక... లోకం కోసమా...? లేక... లేక... 'ఫార్మాలిటీస్' కోసమా...? లేక నిజంగానే భార్యలకు భయపడి తల్లి పైన ప్రేమా, అభిమానం వుంటే... కనీసం జన్మనిచ్చిన తల్లిని గౌరవం వుంటే చాటుగానైనా ఆమెను పరామర్శించే వాళ్ళు. అన్ని అవసరాలు కాకున్నా కొన్నైనా తల్లి అవసరాలు తీర్చేందుకు కనీసం ప్రయత్నమైన చేసేవాళ్ళు. వాళ్ళు ఏడ్వటం అంతా నటన... ఇదంతా ఒక ఫార్సు. లోకం గురించే ఇదంతా. ఎస్... ఈ అనుబంధాలు, బంధాలు అంతా ట్రాష్.

ఈ మనుష్యులకు మనస్సు మమతా ఏవి లేవు. పట్టి చూస్తే ఎవరి ముఖంలోను దుఃఖం, బాధ కన్పించటం లేదు. చిత్రంగా... కళ్ళు మాత్రం ధారాపాతంగా నీళ్ళు కారుస్తున్నాయి. ఆశ్చర్యం... వారికెలా వస్తున్నాయో కళ్ళలో నీళ్ళు అంతలా...

వాళ్ల ఏడుస్తుంటే నిఖిల్‌కి బాధ కలుగలేదు సరికదా అసహ్యం వేస్తోంది. ఆమె బ్రతికుండగా ఒకసారైనా ఆదరంగా ఆమెను పలుకరించలేదు.

ఇప్పుడు మాత్రం లోకం నుండి సానుభూతి పొందటానికి ఎంతలా ఏడుస్తున్నారు... కాదు... కాదు.... నటిస్తున్నారు. చివరికి ఆమె శవాన్ని సైతం ఇలా ఉపయోగించుకుంటున్నారు. ఛీ... ఛీ... జీవితమంటే ఇదా...? ఇదా జీవితం...?

నాన్నమ్మ చనిపోయిందని వచ్చిన నిఖిల్‌కు బాధల నుండి విముక్తి పొంది ప్రశాంతంగా కళ్ళు మూసుకుని పడుకున్నట్లున్న నాన్నమ్మను చూసేసరికి గుండెల నిండా ఏదో రిలీఫ్ కలిగింది. బ్రతికుండగా దిగులుతో, భయంతో, అవమానంతో, కళ్ళల్లో నీళ్ళను అదిమి పెడుతూ కనిపించేది. బాధతో కుమిలిన ఆమె ముఖాన్ని చూడగానే నిఖిల్‌కు గెండెల్లో ఎవరో శూలంతో పొడిచినట్టయ్యేది.

ఇప్పుడు నాన్నమ్మ బాధల నుండి విముక్తి పొంది ప్రశాంతంగా, విశ్రాంతి తీసుకున్నట్లున్న నాన్నమ్మను చుసేసరికి నిఖిల్‌కు అదోకలాంటి విరక్తి భావన. ఆ భావన నుండి ఏదో రిలీఫ్ కలుగుతోంది.



## రీమేక్ చిత్రాల్లో 'అనిల్'

ప్రస్తుతం 'అనిల్ కపూర్' రిమేక్ చిత్రాల్లో ఎక్కువగా నటిస్తున్నాడు. అతను నటిస్తున్న 'లాడ్లా' చిత్రానికి తెలుగు చిత్రం ఘరానామొగుడు, అందాజ్ చిత్రానికి తెలుగు సుందరకాండలు ఆధారం. అలాగే తమిళ చిత్రం 'దేవర్ మగన్' హిందీ రీమేక్‌లో కూడా నటించబోతున్నాడు. రీమేక్ చిత్రాలంటే జితేంద్ర పేరు వినిపించేది.